సాక్షి రంగారెడ్డి

బుధవారం । 15 । మార్చి । 2023



సైన్స్ ఎగ్జిబిషన్‌తో విజ్ఞానం

సైన్స్ ప్రదర్శనలతో విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికితీయొచ్చని ఆకృతి ప్రాజెక్టు సీనియర్ అసిస్టెంట్ మేనేజర్ గిరిజ అన్నారు. 8లో▸



పనుల పరిశీలన

మన ఊరు–మన బడిలో భాగంగా మంచాల మండలం నోముల పాఠశాలలో చేపట్టిన మరమ్మతులను అధికారులు పరిశీలించారు. 8లో▸

గ్రామాలపై ఎస్ఓటీ నిఘా

గ్రామీణ ప్రాంతాలపై సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్స్ టీం (ఎస్ఓటీ) పోలీసులు దృష్టి సారించారు. స్థానిక యువతతో నిరంతరం సత్సంబంధాలు నెరపుతూ.. జరిగే ప్రతి చిన్న నేరం తమ దృష్టికి వచ్చేలా పటిష్టమైన ఇన్‌ఫార్మర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ఉత్సాహంగా 'మహిళా మారథాన్'



ర్యాలీలో పాల్గొన్న మహిళలు

మీర్‌పేట: మహిళా వారోత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్ ఆధ్వర్యంలో 'మహిళా మారథాన్' ఉత్సాహంగా సాగింది. మీర్‌పేటలోని బురుజు నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్, మహిళా కార్పొరేటర్లు, సిబ్బంది, ఆర్‌పీలు పాల్గొన్నారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన రంగవల్లులు, క్రీడలు, ఆటలు, వంటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు మేయర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటరెడ్డి, ఆర్ఓ అంజన్‌రెడ్డి, కార్పొరేటర్లు అక్కి మాధవి, ధరంకార్ జ్యోతి, తీగల మాధవి, గోవర్ధన్‌రెడ్డి, రాంచందర్, ముత్తంగి కరుణానిధి, గౌరీ శంకర్, భీంరాజ్, ఇంద్రావత్ రవినాయక్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



షాద్‌నగర్: ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని తెలంగాణ స్కూల్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తిన చెన్నయ్య అన్నారు. బాలికల దినోత్సవం ముగింపు సందర్భంగా మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో, కందివనంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులకు కరాటే, జూడో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు, యువతులు, విద్యార్థినులు స్వీయ రక్షణ కోసం తప్పనిసరిగా యుద్ధ విద్యలను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు మల్లేశ్, గుడికాడి ఆంజనేయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థల్లో 2023–24 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశ పరీక్ష కోసం ఇంగ్లిష్ మీడియంలో చేరేందుకు 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 16వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు చెప్పారు. ఈ లోపు రూ.వంద రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శంకర్‌పల్లి గురుకులంలో..

మొయినాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని మొయినాబాద్‌లోని శంకర్‌పల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జయమ్మ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు వీటీజీ సెట్ ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపటి వరకు గడువు

ఇబ్రహీంపట్నం: గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి ప్రవేశాలకు గురువారం వరకు గడువు ఉందని స్థానిక టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ వెబ్ పోర్టల్‌కు వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ తర్వాత రాత పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తారని తెలిపారు.

పగటి పూట ఎండ.. రాత్రి వేళ ఠండా

సాక్షి, సిటీబ్యూరో: పగటిపూట ఎండలు మండుతున్నాయి. రాత్రి వేళ చలి వణికిస్తోంది. వారం రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రత పెరుగుతున్నా.. రాత్రివేళ సాధారణ కనిష్ట ఉష్ణోగ్రత మైనస్‌లో పడిపోతోంది. ఫలితంగా చలి వాతావరణం పునరావృతమవుతోంది.మంగళవారం గరిష్ట ఉష్ణోగ్రత 34.6.. కనిష్ట ఉష్ణోగ్రత 19.1 డిగ్రీలుగా నమోదయ్యాయి. సాధారణం కంటే 2 డిగ్రీలు తక్కువ కావడంతో చలి ప్రభావం కనిపిస్తోంది. మరోవైపు రాష్ట్రంలో ద్రోణి ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. పగటి పూట ఎండలు, సాయంత్రానికి వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు.

ఆల్ ది బెస్ట్

నేటినుంచి ఇంటర్ పరీక్షలు

- ఉదయం 8.30 నుంచే అనుమతి
- సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లకు అనుమతిలేదు
- గట్టి పోలీసు బందోబస్తు

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు అరగంట ముందుగానే చేరుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. పరీక్ష కేంద్రంలోకి 8.30 గంటల నుంచే అనుమతించనున్నారు. పరీక్ష ప్రారంభానికి కనీసం 15 నిమిషాల ముందు హాల్‌లో తమకు కేటాయించిన సీట్లలో కూర్చోవాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రానికి నిమిషం ఆలస్యమైనా అనుమతించవద్దని ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ఆదేశించారు. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లకు అనుమతి లేదు. ఎవరైనా వాటిని తీసుకొస్తే స్వాధీనం చేసుకుంటారు.

గ్రేటర్ పరిధిలో ఇలా..

పరీక్ష రాయనున్న విద్యార్థులు:	4,17,740
ప్రథమ సంవత్సరం:	2,19,790
ద్వితీయ సంవత్సం:	1,97,950
పరీక్ష కేంద్రాలు:	548
చీఫ్ సూపరింటెండెంట్లు:	548
డిపార్ట్‌మెంట్ అధికారులు:	548
ఫ్లయింగ్ స్క్వాడ్‌లు:	12
సిట్టింగ్ స్క్వాడ్‌లు:	12
హైపవర్ కమిటీలు:	03

ఏర్పాట్లు పూర్తి

విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు రాసేలా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సౌకర్యంతో పాటు ప్రాథమిక చికిత్స కోసం ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. పరీక్ష సమయాలకు అనుగుణంగా అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులు నడిపించనున్నారు. కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయనున్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల మధ్యన ప్రశ్నపత్రాల బండిల్స్ తెరిచేలా చర్యలు చేపట్టారు. విద్యార్థులు హాల్ టికెట్‌ను జాగ్రత్తగా పరిశీలించుకోవాలి. ఏదైనా తేడా ఉంటే ముందస్తుగా కళాశాల ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లి సరిదిద్దుకోవాల్సి ఉంటుంది.



ఆమనగల్లు: పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న అధికారులు, సిబ్బంది

ప్రైవేటు కేంద్రాలపై నిఘా

ప్రైవేటు విద్యా సంస్థల్లోని పరీక్ష కేంద్రాలపై నిఘా పెట్టారు. అదనంగా అధికారులను నియమించారు. ప్రతి గదిలో నిఘా నేత్రం ఉండేలా, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోనున్నారు. గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కడ్తాల్‌లో పర్యటిస్తున్న జాతీయ జీవనోపాధి మిషన్ ప్రతినిధులు

అభివృద్ధి పనులు భేష్

జాతీయ జీవనోపాధి మిషన్ ప్రతినిధుల కితాబు

కడ్తాల్: తెలంగాణ ప్రభుత్వం గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు ఆదర్శవంతంగా ఉన్నాయని జాతీయ జీవనోపాధి మిషన్ ప్రతినిధులు ప్రశంసించారు. అభివృద్ధి పనుల నిర్వహణ, నాయకత్వ లక్షణాలు, స్థానిక సంస్థల ప్రాముఖ్యతలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో ఎన్ఐఆర్‌డీపీఆర్ రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో తెలంగాణ, నాగాలాండ్, త్రిపుర, దాద్రానగర్‌హవేలి, తమిళనాడు, కేరళ, కర్ణాటక, డయ్యూడామన్, రాష్ట్రాలకు చెందిన గ్రామీణాభివృద్ధి సంస్థ సంచాలకులు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారులు, జిల్లాల ప్రాజెక్ట్ మేనేజర్లు పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని మహిళ సంఘాల సభ్యులతో మాట్లాడి, ప్రభుత్వం ద్వారా మహిళా సంఘాలకు అందుతున్న రుణ సదుపాయం, లబ్ధి పొందుతున్నవారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకుల ద్వారా పొందుతున్న రుణాలతో మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన పచ్చళ్ల తయారీ, వ్యాపార సంస్థలు, మగ్గం పనులను పరిశీలించారు. అనంతరం కడ్తాల్ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రంతో పాటు, రైతువేదిక, పల్లెప్రకృతి వనం, వైకుంఠధామాలు, పంచాయతీ కార్యాలయాన్ని వారు సందర్శించారు. పంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు ఆదర్శవంతంగా ఉన్నాయని, మహిళల ఆర్థికాభివృద్ధికి మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలు, రుణ సదుపాయాలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తమ రాష్ట్రాల్లోనూ అమలయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఐఆర్‌డీపీఆర్ కార్యక్రమ సంచాలకులు అరుణ జయమణి, లకణ్ సింగ్, డిప్యూటీ సీఈవో కరుణాకర్, మన్‌హోమ్ కోన్యాక్, త్రిపుర డిప్యూటీ కలెక్టర్ సూరజ్ దెబ్బర్మ, ఉప సర్పంచ్ రామకృష్ణ, మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, వార్డు సభ్యులు, నాయకులు భాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, భిక్షపతి, దీపిక, మల్లయ్య, మహేశ్, అశోక్, శ్రీను, సురేశ్ ఎంపీవో మధుసూదనచారి, ఏపీఎం రాజేశ్వరి, కార్యదర్శి జగన్ తదితరులు ఉన్నారు.

అందని 'ప్రోత్సాహం'

- లీటరు పాలకు రూ.4 ఇచ్చేది ఎప్పుడో.. !
- జిల్లా వ్యాప్తంగా రూ.14.19 కోట్ల బకాయిలు
- 33 నెలలుగా పాడి రైతుల ఎదురుచూపులు
- పెరిగిన గడ్డి, దాణా ధరలతో ఇబ్బందులు
- ఇన్సెంటివ్ ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి



కడ్తాల్‌లోని పాల సేకరణ కేంద్రం

కడ్తాల్: వ్యవసాయ రంగానికి అనుబంధంగా పాడి పరిశ్రమను ఎంచుకున్న పాడి రైతులు ప్రోత్సాహక నగదు అందక ఇక్కట్లు పడుతున్నారు. పెరుగుతున్న ధరలతో పాడి పోషణ మోయలేని భారంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం అందిస్తామన్న ప్రోత్సాహకం సైతం రాక నిరుత్సాహానికి గురవుతున్నారు. లీటరు పాలకు చెల్లిస్తున్న ప్రోత్సాహక నగదు రూ.4చొప్పున 33 నెలలుగా అందించకపోవడంతో కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. జిల్లాలో కడ్తాల్, షాద్‌నగర్‌లో పాలశీతలీకరణ కేంద్రాలు ఉండగా, మరో 12 బీఎంసీ (బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్) కేంద్రాలు ఉన్నాయి. చాలామంది రైతులు బోర్లపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తూ, పాడిపోషణ చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కాసింత పచ్చిగడ్డి వేసుకుని పాడి పరిశ్రమతో జీవనోపాధి పొందుదామని ఆశించిన వారంతా సకాలంలో ప్రోత్సాహకం అందక నిరాశలో మునిగిపోయారు.

తలకుమించిన భారం

2020 మే నుంచి ప్రోత్సాహకం అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశుగ్రాసం, దాణా ధరలు పెరిగిపోవడంతో అప్పు చేసి పాడిని కొనసాగిస్తున్నారు. క్వింటాలు దాణా రూ.3వేలపైనే ఉంది. ట్రాక్టర్ గడ్డి రూ.15 వేలకు పైగా ఉండగా, లారీ గడ్డికి రూ.30 వేలు వెచ్చించాల్సి వస్తోంది. పాల ఉత్పత్తి కంటే పాడి పశువులను బతికించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్సెంటివ్‌కు సంబంధించి వెంటనే బడ్జెట్ కేటాయించి ఖాతాల్లో జమ చేయాలని, లేని పక్షంలో ఆందోళనకు సిద్ధమని హెచ్చరిస్తున్నారు.

33నెలలుగా ఊసే లేని ఇన్సెంటివ్

జిల్లాలో సుమారు 12 వేల మంది రైతుల నుంచి రోజుకు 55 వేల నుంచి 60 వేల లీటర్ల పాలను విజయ డెయిరీ సేకరిస్తోంది. కడ్తాల్, షాద్‌నగర్ పాలశీతలీకరణ కేంద్రాలతో పాటు, వివిధ పాల సొసైటీలు, 12 బీఎంసీ సెంటర్ల పరిధిలో నిత్యం పాలను సేకరిస్తున్నారు. ప్రోత్సాహకం 2020 ఏప్రిల్ వరకే చెల్లించారు. 33నెలలుగా ఇన్సెంటివ్ ఊసే లేదు. 2020 మే నుంచి జనవరి 2023 వరకు రూ.14,19,07,283 పాడిరైతులకు ప్రోత్సాహక బకాయి చెల్లించాల్సి ఉంది. ఇందులో కడ్తాల్ పాల శీతలీకరణ కేంద్రం పరిధిలో సుమారు రూ.9.90 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రోత్సాహక డబ్బులు ఖాతాల్లో జమ చేయాలని పాడి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇబ్బందిగా ఉంది



ఉన్న కొద్దిపాటి బోరు నీటితో ఇరవై పాడి ఆవులతో పాడి పోషణ చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాం. రోజుకు 50 లీటర్ల పాలను విజయ డెయిరీకి పోస్తుంటాం. గడ్డి, దాణా ధరలు బాగా పెరగడంతో పాడి పశువులను సాకడం ఇబ్బందిగా ఉంది. 33నెలలుగా లీటరు పాలకు రూ.4 ప్రోత్సాహకం అందడం లేదు. రూ.2 లక్షలకు పైగా రావాల్సి ఉంది. వెంటనే నగదును విడుదల చేసి ఆదుకోవాలి.

– జగన్ నాయక్, పాడిరైతు, టాక్‌రాజుగూడ

ప్రతిపాదనలు పంపించాం



ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు పంపిస్తున్నాం. పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో రూ.4 ప్రోత్సాహకానికి సంబంధించిన డేటాను ఈ ల్యాబ్‌లో నమోదు చేస్తున్నాం. కొత్తగా విజయ డెయిరీకి పాలు విక్రయించే రైతులను కూడా ఈ ల్యాబ్‌లో ఎంట్రీ చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.

– రాధిక, పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్, కడ్తాల్

మాసబ్ చెరువును పరిరక్షించాలి



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ తదితరులు

తుర్కయంజాల్: వారసత్వ సంపద అయిన మాసబ్ చెరువులో డంప్ చేసిన మట్టిని తొలగించి, ఆక్రమణకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు. తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువును మంగళవారం ఆయన బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహా రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ.. రూ.300 కోట్ల విలువైన భూమిని పట్టపగలు ఆక్రమించాలని చూస్తున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలతో పాటు అధికార టీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్‌పార్టీ నాయకుల ప్రమేయం ఉందని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని, అవసరమైతే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. బొక్క నర్సింహా రెడ్డి మాట్లాడుతూ.. నిజాం కాలం నుంచి కాపాడుతూ వచ్చిన మాసబ్ చెరువును ప్రస్తుతం అన్యాక్రాంతం చేయాలని చూస్తుండటం దారుణమన్నారు. ఈ అంశంపై కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని, న్యాయం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బోసుపల్లి ప్రతాప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లచ్చిరెడ్డి, రాష్ట్ర నాయకుడు నోముల దయానంద్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు బచ్చిగళ్ల రమేష్, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు డి.శ్రీనివాస్ నాయక్, అసెంబ్లీ కన్వీనర్ ఎన్ను యాదగిరి రెడ్డి, నాయకులు కొండ్రు పురుషోత్తం, కౌన్సిలర్ కదారి శ్రీలత అనిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

సమాజంలో మహిళల పాత్ర గొప్పది

జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మీర్‌పేట: సృష్టికర్తలు మహిళలేనని, సమాజంలో వారి పాత్ర ఎంతో గొప్పదని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. టీకేఆర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మీర్‌పేటలోని టీకేఆర్ కళాశాలలో మహిళా దినోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని, అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాలోనూ శాస్త్రవేత్తలుగా రాణిస్తున్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళాభివృద్ధికి పెద్దపీట వేశారని పేర్కొన్నారు. కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ కుటుంబం, పిల్లల చదువుల కోసం మహిళలు ఎన్నో త్యాగాలు చేస్తారని, ఎన్ని సమస్యలు ఎదురైనా ధైర్యం ఇచ్చేది వారేనని అన్నారు. అనంతరం మహిళలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాధవరావు, మాధవరెడ్డి, బుడగం హరితారెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఎస్.కృష్ణకుమారి, కమలారెడ్డి పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల రాజ్యం రావాలి

డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్



మహదేవ్‌పూర్‌లో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న నాయకులు

కొందుర్గు: తెలంగాణలో సబ్బండ వర్గాల రాజ్యం రావాలని డీఎస్పీ (దళిత్ శక్తి ప్రోగ్రాం) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. ఆయన చేపట్టిన పదివేల కిలోమీటర్ల పాదయాత్ర మంగళవారం మండలంలోని మహదేవ్‌పూర్, ఉత్తరాసిపల్లి, ముట్పూర్, టేకులపల్లి గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జెండావిష్కరణలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కోటిమంది అభాగ్యులు సరైన ఉపాధి అవకాశాలు లేక జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ జనాభా ఉన్న వర్గాలు అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాకేష్, నాయకులు పెంటయ్య, అజీం, మాధవ రెడ్డి, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

అరుదైన వ్యాధుల నివారణపై అవగాహన

లక్డీకాపూల్: అరుదైన వ్యాధుల నివారణ కోసం జాతీయ విధానం ఉందనే విషయంలో తొలి అడుగు వేసినట్లు ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిసీజెస్ ఇండియా (ఓఆర్‌డీఐ) కో ఫౌండర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసన్న కుమార్ షిరోల్ అన్నారు. మంగళవారం ప్రపంచ రేర్ డిసీజ్ డే సందర్భంగా అవగాహన కల్పించేందుకు 7కే వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రేస్ ఫర్ 7' ప్రపంచంలో అతి పెద్ద మల్టీ సిటీ కార్యక్రమాల్లో ఒకటన్నారు. దీనిద్వారా అత్యంత అరుదైన వ్యాధుల (రేర్ డిసీజెస్)పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రేర్ డిసీజెస్‌కు సమగ్ర చికిత్స, స్థానికంగా ఔషధాల అభివృద్ధి, బీమా కవరేజీ మొదలైన సవాళ్లను కూడా పరిష్కరించుకోవాల్సి ఉందన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతులు కలపడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ హెడ్ డాక్టర్ అశ్విన్ దలాల్, సౌత్ ఆసియా ఐక్యూవీఐఏ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ అమిత్ మూకిమ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి తీగ చోరీ


దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు

కందుకూరు: వ్యవసాయ పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి విలువైన రాగి తీగలను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ సంఘటన కందుకూరు పీఎస్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పులిమామిడి పరిధిలోని వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు రాత్రి కూలదోసి, అందులో విలువైన రాగి తీగలను దొంగిలించారు. మంగళవారం ఉదయం విషయాన్ని గుర్తించిన రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ కొండల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నల్లబెల్లం, పటిక స్వాధీనం

పరారీలో నిందితుడు


పట్టుబడిన నల్లబెల్లం, పటికను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

తుర్కయంజాల్: అక్రమంగా నిల్వ ఉంచిన 7వేల కేజీల నల్లబెల్లం, 300 కేజీల పటికను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం తుర్కయంజాల్‌లో చోటుచేసుకుంది. ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామంలోని ఒక ఇంట్లో సారా తయారీకి వినియోగించే నల్లబెల్లం, పటిక నిల్వ ఉంచారనే సమాచారం అందింది. మంగళవారం వెళ్లి డోర్ పగుల గొట్టి చూడగా నల్లబెల్లం, పటిక నిల్వ ఉన్నట్లు గుర్తించామని, మహారాష్ట్రలోని లాంతూర్ నుంచి దేవరకొండకు చెందిన చందర్ దిగుమతి చేసుకున్నాడని పోలీసులు చెప్పారు. ఈ బెల్లం, పటికను సారా తయారీకి ఇబ్రహీంపట్నం, మాల్, దిండి, దేవరకొండ, చందంపేట తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తేలిందని.. నిందితుడు చందర్ పరారీలో ఉన్నాడని పోలీసులు వెల్లడించారు.

హిజ్రాగా మారేందుకు వెళ్తున్నా..

- నా గురించి వెతకొద్దు
- సోదరుడికి యువకుడి వాట్సాప్ సందేశం


శివ(ఫైల్)

పహాడీషరీఫ్: హిజ్రాల్లో కలిసేందుకు వెళ్తున్నా.. నాగురించి వెతకొద్దు అంటూ ఓ యువకుడు సోదరుడికి వాట్సాప్ మెసేజ్ చేసి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన ఎల్లయ్య కుమారుడు జర్పాటి శివ మంగళవారం ఉదయం 8 గంటలకు ఇంట్లో నుంచి అరతులం బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి, కొంత నగదు, దుస్తులు తీసుకొని ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. కాసేపటికి అతని సోదరుడి ఫోన్‌కు వాట్సాప్‌లో 'నేను ఇంట్లో ఉండడానికి నా వల్ల ఐత లేదు...నేను కొజ్జాల్లో(హిజ్రా) కలిసేందుకు వెళుతున్నా.. కాబట్టి అమ్మ,నాన్నలను మంచిగా చూసుకో, వాళ్లకు నేను లేను అనే బాధ కలగకుండా నువ్వే గుండె ధైర్యం కావాలి.. ఉన్న ఇల్లు, బంగారం, వెండి, బండి నీకే ఐతై. చిట్టి డబ్బులు మిగిలిన 17 నెలలు నువ్వే కట్టుకో, పోలీసు వాళ్లకు ఫిర్యాదు చేసి టైం వృథా చేసుకోకు.. నేను ఢిల్లీ వెళుతున్నా' అంటూ మెసేజ్ చేశాడు. ఈ విషయమై అతని సోదరుడు మల్లేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 94906 17241 నెంబర్‌లో గాని సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

శివారు గ్రామాలపై ఎస్‌ఓటీ నిఘా

- సైబరాబాద్‌లో 250 మంది ఎస్‌ఓటీ పోలీసులు
- స్థానిక యువకులతో ఇన్‌ఫార్మర్ వ్యవస్థ
- నిరంతరం టచ్‌లో ఉంటూ సమాచార సేకరణ
- ప్రతీ చిన్న నేరం రిపోర్ట్ అయ్యేలా చర్యలు
- రిసార్టులు, ఫామ్‌హౌస్‌లలో ఆకస్మిక తనిఖీలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రామీణ ప్రాంతాలపై సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్స్ టీం (ఎస్‌ఓటీ) పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. స్థానిక యువతతో నిరంతరం సత్సంబంధాలు నెరపుతూ.. గ్రామాల్లో జరిగే ప్రతి చిన్న నేరం పోలీసుల దృష్టికి వచ్చేలా పటిష్టమైన ఇన్‌ఫార్మర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో ఇప్పటివరకు మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా వంటి వ్యవస్థీకృత నేరాలతో పాటు రేషన్ బియ్యం అక్రమ తరలింపు, గ్యాస్ దందా, కల్తీ ఆహార ఉత్పత్తులు, భూ తగాదాలు వంటి అన్ని రకాల నేరాలపై ఫోకస్ పెట్టారు.

- గతంలో సైబరాబాద్ అంతటికీ ఒకటే ఎస్‌ఓటీ జోన్ ఉండేది. ఇటీవల శాంతి భద్రతల విభాగంలో పునర్ వ్యవస్థీకరణలో భాగంగా బాలానగర్, మాదాపూర్‌లను రెండు ఎస్‌ఓటీ జోన్లుగా విభజించారు. డీసీపీలను సైతం నియమించారు. మాదాపూర్, రాజేంద్రనగర్, బాలానగర్, శంషాబాద్, మేడ్చల్ ఐదు జోన్లలో కలిపి ఎస్‌ఓటీలో మొత్తం 250 మంది సిబ్బంది ఉంటారు. ప్రతి పోలీసు స్టేషన్‌లో ఇద్దరు ఎస్‌ఓటీ కానిస్టేబుల్స్‌ను నియమించారు. స్థానిక యువతతో నిరంతరం సత్సంబంధాలు నెరపుతూ.. నేర సమాచారాన్ని సేకరిస్తున్నామని బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.
- సాధారణంగా గ్రామీణ ప్రాంతాలలో జరిగే చిన్న చిన్న నేరాలు పోలీసు స్టేషన్ వరకు రానివ్వరు. గ్రామ పెద్దలు, స్థానిక నేతలే మధ్యవర్తిత్వం వహించి రాజీ చేస్తుంటారు. అయితే ప్రస్తుతం గ్రామాలకు సైతం ఎస్‌ఓటీ సేవలు విస్తరించడంతో ప్రతి చిన్న నేరం కూడా పోలీసుల దృష్టికి వస్తుంది. ప్రతివారం సైబరాబాద్ పరిధిలోని రిసార్టులు, ఫామ్‌హౌస్‌లు, పబ్‌లలో ఆకస్మిక దాడులు చేసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తున్నారు. ఆయా ఆస్తులను సీజ్ చేస్తున్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండానే..

గ్రామాలు, శివారు ప్రాంతాలలో చాలా వరకు చిన్న కంపెనీలు ట్రేడ్ లైసెన్స్ లేకుండానే ఇష్టానుసారంగా వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. దీంతో ప్రభుత్వానికి నష్టం జరుగుతుంది. స్థానిక పోలీసులకు సైతం వీటిపై అవగాహన ఉండదు. ఇటీవల రూ.4 లక్షలు విలువ చేసే వీడ్ ఆయిల్‌ను సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు.

'మన ఊరు-మన బడి' పనుల పరిశీలన

మంచాల: మండల పరిధిలోని నోముల గ్రామంలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో నిర్వహించిన మరమ్మతు పనులను ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ పనుల నిమిత్తం ప్రభుత్వం రూ.9.38లక్షలు మంజూరు చేసింది. వాటిలో రూ.6లక్షలకు సంబంధించిన పనులు పూర్తి చేశారు. దీంతో పనులు ఏ మేరకు నిర్వహించరనేది అధికారుల బృందం తనిఖీ చేసింది. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తారి రాజిరెడ్డి విద్యుత్ మరమ్మతు పనులు, కిచన్ షెడ్ నిర్మాణంతో పాటు తాగు నీటి సరఫరా పైపులైన్ మరమ్మతు పనులు చేశామని అధికారులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఆర్అండ్‌బీ శాఖ ఎస్ఈ చిన్న పుల్లాదాస్, ఈఈ యుగేంధర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ సురేందర్, ఏఈఈ ప్రశాంతి, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ సాయినాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న అధికారుల బృందం

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి బలవన్మరణం

- భర్త వేధింపులు తాళలేక వివాహిత
- ప్రేమ విఫలమై యువకుడు

మహేశ్వరం: భర్త వేధింపులు భరించలేక ఓ వివాహిత ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ మధుసూదన్, మృతుడి కుటుంబీకులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సుభాన్‌పూర్ గ్రామానికి చెందిన మాదరమోని శ్యాంసుందర్-సుగుణ దంపతుల చిన్న కుమార్తె దుర్గాభవాని(20)కి, తుక్కుగూడకు చెందిన చింతల రాజుతో ఏడాదిన్నర క్రితం వివాహం చేశారు. పెళ్లయిన కొద్ది రోజుల తర్వాత వారు మండల కేంద్రంలో ఓ అద్దెంటికి మారారు. ఈ క్రమంలో భర్త ఆమెను రోజు చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. గతంలో పెద్దల సమక్షంలో మాట్లాడి దంపతులకు సర్ది చెప్పి కాపురానికి పంపారు. రాజు తీరు మారకపోవడంతో విసిగిపోయిన దుర్గాభవాని మంగళవారం మధ్యాహ్నం అద్దె ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం నుంచి తలుపులు తెరవకపోవడంతో.. చుట్టు పక్కల వారు అనుమానంతో బంధువులకు సమాచారం ఇచ్చారు. తలుపులు బద్దలు కొట్టిచూడగా ఆమె ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏసీపీ అంజయ్య, సీఐ, ఎస్‌ఐలు ఘటనా స్థలికి చేరకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. భర్త రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రియురాలికి వివాహమైందని..

హయత్‌నగర్: ప్రేమించిన యువతి మరొకరిని పెళ్లి చేసుకోవడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం హయత్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మునగనూరువడ్డెర బస్తీకి చెందిన పందిగోటి అనంతమ్మ కొడుకు గణేశ్(23) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఏడాది నుంచి అతను ఓ యువతిని ప్రేమిస్తున్నాడు కాగా ఇటీవల ఆ యువతి మరొకరిని వివాహం చేసుకుంది. మూడు రోజుల క్రితం ఆమె తన పెళ్లి ఫొటోలను గణేశ్‌కు పంపింది. దీంతో అప్పటి నుంచి ముభావంగా గణేశ్ సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. మంగళవారం ఉదయం గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి..


సుందర్‌రెడ్డి (ఫైల్)

శంకర్‌పల్లి: పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రొద్దుటూరులో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన సురకంటి సురేందర్‌రెడ్డి(46) మొయినాబాద్ రాణే కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా సురేందర్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో పొలానికి వెళ్లి పురుగు మందు తాగి పడిపోయాడు. సమీప పొలాల రైతులు గమనించగా అతని దగ్గర పురుగు మందు వాసన రావడంతో కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడుని చికిత్స నిమిత్తం శంకర్‌పల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని చికిత్స నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య స్వాతి, కుమారుడు చక్రధర్‌రెడ్డి, కూతురు ఉన్నారు. చక్రధర్‌రెడ్డి దొంతాన్‌పల్లిలో ఓ కళాశాలలో బీటెక్ చదువుతూ వ్యసనాలకు బానిసయ్యాడు. కుమారుడి ప్రవర్తనవల్లే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని గ్రామస్తులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మహేశ్ మృతదేహం

కడ్తాల్: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బక్క మహేశ్(28) కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం దాహం వేయడంతో నీరు తాగేందుకు బోర్ మోటారు వద్ద వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు, సమీప పొలాల రైతులు బాధితుడిని కడ్తాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. బాధిత కుటుంబ సభ్యులను ఎంపీటీసీ సభ్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొప్పిడి గోపాల్ పరామర్శించి, రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు.

వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తి.. శవమై తేలాడు

రాజేంద్రనగర్: వాకింగ్‌కు వెళ్లిన ఓ వ్యక్తి హిమాయత్‌సాగర్‌లో శవమై తేలాడు. ఈ ఘటన రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఖలీల్ తెలిపిన ప్రకారం.. కార్వాన్‌కు చెందిన ప్రమోద్(39) ప్రైవేటు ఉద్యోగి. ఇతడికి 15ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. భార్యపై అనుమానంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గతంలో ప్రమోద్ ఆత్మహత్యకు యత్నించాడు. ఈ నెల 12న ఉదయం వాకింగ్‌కు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం హిమాయత్‌సాగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తేలిందనే సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి వద్ద ఉన్న ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌తో విజ్ఞానం పెంపు



అజీజ్‌నగర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు ఉత్తమ బహుమతి అందజేస్తున్న ప్రాజెక్టు సభ్యులు

మొయినాబాద్‌రూరల్: సైన్స్ ప్రదర్శనలతో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయవచ్చునని.. విజ్ఞానం పెంపొందిచవచ్చునని యునైటెడ్ వే హైదరాబాద్, ఆకృతి ప్రాజెక్టు సీనియర్ అసిస్టెంట్ మేనేజర్ గిరిజ అన్నారు. యునైటెడ్ వే హైదరాబాద్, ఆకృతి ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండల పరిధిలోని అజీజ్‌నగర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో విద్యార్థుల ఎగ్జిబిట్స్ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గిరిజ మాట్లాడుతూ.. విద్యార్థులల్లో నైపుణ్యాలు వెలికితీసేందుకు ఆకృతి ప్రాజెక్టు వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు బాలస్వామిరెడ్డి, నర్సింహ, సింహాచలం, ప్రాజెక్టు కమిటీ మేనేజర్ ముంతాజ్, జిల్లా మేనేజర్ అమర్‌నాథ్, ప్రాజెక్టు లీడ్ సభ్యులు సీమా, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ ఆకృతిలో విద్యార్థులు

ఆర్‌ఆర్‌ఆర్ సినిమా ఒరిజినల్ సాంగ్ విభాగంలో నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు వరించింది. దీంతో పట్టణంలోని ఆమనగల్లు గ్రామర్ హైస్కూల్ విద్యార్థులు సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు ఆర్‌ఆర్‌ఆర్ ఆకృతిలో ఏర్పడి సినిమా బృందానికి అభినందనలు తెలిపారు. - ఆమనగల్లు

